

చిరస్మరణీయుడు

వారణాసి సత్యవతి

"అమ్మా!"

వెనక్కి తిరిగి చూశాను.

దాదాపు అరవై, డెబ్బై ఏళ్లుండే ఆ వృద్ధుడే దీనంగా చెయ్యి చాపి నుంచున్నాడు.

నంచి తెరిచి ఒక పావలా బిళ్ల తీసి అతని చేతిలో పెట్టాను.

అతను నా కాళ్లను చేతితో తాకి, ఆ చెయ్యి ఎదుటికి ఆనించుకున్నాడు.

కాళ్లు వెనక్కి లాక్కున్నాను.

అంత వయసున్న ఆ వృద్ధుడు ఒక పావలా బిళ్లకే అంత కృతజ్ఞతతో నా కాళ్లను తాకుతుంటే నాకు చెప్పరాని చిన్నతనంగా అనిపించింది.

దూరంగా బస్సు వస్తూ కనిపించడంతో అక్కడంతా తొక్కినలాట ప్రారంభమయింది.

రోజూలాగే వరుగెత్తుకుంటూ బస్సు కెదురెళ్లి డ్రైవరు బస్సు ఆపేదాకా బస్సుతోపాటే మళ్లీ వెనక్కి వచ్చి, అందరినీ తోసుకుంటూ ఎలాగైతే నేం బస్సెక్కి నిలబడటానికి చోటు దొరికించుకుని చుట్టూ ఉన్న సీట్ల కేసి చూశాను - ఎవరైనా తెలిసిన వాళ్లు కనిపిస్తారేమో నని. మూడవ సీట్లో కూర్చున్న నన్నపా టామెను చూసి, పలకరింపుగా నవ్వాను.

రోజూ ఈ బస్సులో ప్రయాణించాలంటే ఇలాంటి వన్నీ నేర్చుకోవాల్సిందే.

బస్సులో నిల్చున్న వాళ్లు కూర్చున్న వాళ్లలో ఎవరైనా ముఖపరిచయమైనా సరే, కనపడగానే నవ్వడం, ఆ కూర్చున్న వాళ్లేమో మొహమాటానికి ఇద్దరు కూర్చునే ఆ సీట్లోనే ముందుకు జరిగి కూర్చుంటే, ఆ కాస్త ఖాళీలోనూ ఇరుక్కుని కూర్చుని 'అమ్మయ్య' అనుకోవటం వరిపాటే.

"ఈ రోజు కూడా బస్సు లేటే కదండీ!" అన్నా నామెతో.

"అవునండీ! రోజూ లేటే ఈ పాడు బన్సు! దీని ముందు బన్సు పట్టుకుందామంటే కుదిరి చావటంలేదు!" విసుగ్గా అం దామె.

"ఏం ఉద్యోగాలో, ఏం పాడో! చచ్చీ చెడీ పొద్దుటే పనులన్నీ హడావుడిగా పూర్తి చేసుకుని ఈ బన్సుల్లో ప్రయాణించి ఫ్యాక్టరీకి చేరేసరికే నగం నీరసం వచ్చేస్తుంది."

"అవునండీ! ఈ ప్రైవేటు కంపెనీల్లో మనుషుల్ని మిషన్లలాగా పనిచేయించటమే తెలుసు కానీ, వారి కష్ట సుఖాలు పట్టించుకునే దెవరండీ! ఇంతా చేసి, జీతాలైనా సరిగ్గా పెంచి చావరు. గతిలేకా మతి లేకా అన్నట్టుగా ఉంది మన పని!"

రోజూ చెప్పుకునే బాధలే చెప్పుకుంటూండగానే మా స్టాపు రావటంతో మళ్లీ జనాన్ని తోసుకుంటూ కిందికి దిగాను.

బస్‌స్టాప్ నుంచి గబగబా పదిహేను నిముషాల పాటు నడిచి మా ఫ్యాక్టరీకి చేరేసరికి అటెండెన్స్ రిజిస్టరు ఆఫీసరు కేబిన్‌లోకి వెళ్లిపోయింది.

ఉసూరు మనుకుంటూ వెళ్లి సంతకం చేసి, చీవాట్లు తిని సీట్లోకొచ్చి కూలబడ్డాను.

సాయంత్రం అయిదు గంటలదాకా వంచిన తలెత్తకుండా గాడిద చాకిరీయే.

** ** **

చలికాలం వల్ల ఎంతకీ మునుగు తీయబుద్ధి కావటంలేదు.

బద్ధకంగా లేచి ఒళ్లు విరుచుకుని బాత్‌రూమ్ కేసి నడిచాను.

'అబ్బబ్బ! ఏం చలి బాబూ! వళ్లు కరుచుకుపోతున్నాయి' అనుకుంటూనే వాటర్ హీటర్ ఆన్ చేశాను.

ఎంత తొందరగా లేచి పనులు పూర్తి చేసుకుని మొదటి బన్సుకే వెళ్దామన్నా ఈ పాడు చలి మూలంగా కుదరటంలేదు.

** ** **

జంటనగరాల మొత్తానికి ఈ బాలానగర్ బస్‌స్టాపంత ఛెండాలంగా ఇం కే స్టాపూ ఉండదనిపిస్తుంది. అందులో ఈ చలికాలం మరీను.

రోడ్డుకి రెండు పక్కలా సీతాఫలాల బండ్లతో కిక్కిరిసి ఉంటుంది.

చుట్టుపక్కల పల్లెటూళ్ల నుంచి బండ్లలో తెచ్చి అమ్ముకునే లంబాడీలు, బళ్ల పక్కనే వారి వంట పొయ్యిలు వగైరాలు.

'ఇంకా పూర్తిగా తెల్లవారకుండానే ఈ జనానికి ఈ ఆకళ్లేమిటో బాబూ!' అనిపిస్తుంది.

సీతాఫలాలు తింటూ ఉమ్మే గింజలు, తొక్కలతో అక్కడ అడుగు పెట్టడానికి కూడా వీ ల్లేకుండా ఉంది. అది చాలనట్లు జరదా కిళ్లీ ఉమ్ములు - రక్తంలాగా.

జీడిమెట్ల, కూకట్‌పల్లి, బాలానగర్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, స్కూలు పిల్లలు ఎక్కువగా కనిపిస్తారక్కడ. ఆ కూడలి అంతా కంగాళీగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు.

వారానికో, పది రోజులకో మునిసిపాలిటీవాళ్లు నగం నగం శుభ్రం చేయడం, మళ్లీ వెంటనే మామూలే!

అలాంటిదీమధ్య రోజూ కొంచెం శుభ్రంగా కనపడటం మొదలైంది.

ఈ మునిసిపాలిటీ వాళ్ల కింత మంచి బుద్ధి పుట్టిందేమా - తెల్లారకుండానే ఇక్కడ ఇంత శుభ్రంగా ఉంచుతున్నారు అనుకున్నాను.

"అమ్మా!"

మళ్లీ ఆ వృద్ధుడే.

"అబ్బబ్బ! బన్సు రాక మే మేడుస్తూంటే నీ గో లొకటి మధ్యలో!" కొద్దిగా విసుక్కుంటూనే పావలా బిళ్ల తీసి అతని చేతిలో పెట్టాను.

వారం, పది రోజుల నుంచీ ఈ ముష్టివాడు ఇక్కడే కనబడుతున్నాడు.

పాపం! ఈ చలిలో ఇంత వృద్ధుడు ఎక్కడ పడుకుంటున్నాడో కానీ, ఒంటి మీద సరైన బట్టలు కూడా లేవు. మోకాళ్ల కింద వరకూ ఉండే పీలికలైన చొక్కా మాత్రమే ఉంది అతని ఒంటిమీద.

కిటికీలు, తలుపులూ - అన్నీ మూసేసి రగ్గులూ, రజాయీలూ కప్పుకున్నా ఈ చలికి తట్టుకోవడం కష్టంగా ఉంది. పాపం మరి ఇతను?

నే నెక్కాల్సిన బన్సు ఇంకా రావటంలేదు. అందుచేత అతనినే చూడసాగాను.

గోడవారగా పెరిగిన పిచ్చి మొక్కల దగ్గరికి వెళ్లి, నైలుగైదు ఎండు కంపల్లాంటివి ఊడపీకాడు. అవన్నీ కలిపి దగ్గరగా గుత్తిలాగా పట్టుకుని చివరన చిన్న తాడు ముక్క కట్టి చీపురులా తయారుచేశాడు. దాన్ని పట్టుకొచ్చి బస్‌స్టాప్‌లో ఈ చివర నుంచి ఆ చివరి వరకూ గబగబా ఊడవసాగాడు.

చలికి ముడుచుకుని కూర్చున్నవాళ్లు, సీతాఫలాలు తినేవాళ్లూ ఆ మునలి బిచ్చగాడిని తిట్టుకుంటూ లేచారు.

తెల్లటి ప్యాంటు మీద తెల్లటి చొక్కా ఇన్‌షర్ట్ వేసిన ఒక కళ్లజోడు వ్యక్తి గబగబా ఆ వృద్ధుడి దగ్గరకు వెళ్లి -

"ఏంబే! కళ్లు కనబడటంలేదా? ఏంది దుమ్ము నట్టా లేపుతున్నవ్?" అన్నాడు కళ్లెర్రజేస్తూ.

"ఈ దంతా గలీజు గుందని, బాబూ!"

"నీ కేమైంది బే? గలీజు గుంటే పెద్ద మొనగాడొచ్చిండు శుభ్రం చేయనీకి. నాల్రోజుల్సంది చూస్తున్న రోజూ గిట్లనే దుమ్ము లేపుతున్నవ్! రేపట్నించి ను వ్వీడ కనబడ్డావంటే చూడు మల్ల మక్కెలిరగదంత ఏమనుకున్నవో!"

"గట్లనే బాబూ, గట్లనే!" అంటూనే తన చిరుగుల జేబులోనుంచి అగ్గిపెట్టె తీసి, తను ఊడ్చిన చెత్తనంతా ఒక చోట పోగుచేసి అంటించాడు. అక్కడంతా దారుణమైన పొగ అలుముకుంది.

ఇందాకటి తెల్లబట్ట లతను దూకుడుగా ఆ బిచ్చగాడి దగ్గర కొచ్చి, అతని మెడ మీద చేయి వేసి, "ఏం బే! నీ కొక్కపాలి చెప్తే అర్థం కాదా! నీకు మాటల్తో లాభం లేదు!" అంటూ ఒక్క తోపు తోశాడు.

"అమ్మా!" అంటూ వినురుగా కిందపడ్డా డతను. నుదుటికి రాయి కొట్టుకుని రక్తం కారుతోంది. అయినా చుట్టూ ఉన్నవాళ్లంతా చోద్యం చూస్తున్నట్టు చూడసాగారే తప్ప 'అతను చేసినది మంచివనే కానీ తప్పేమీ కాదే ఎందు కతన్నలా బాధించటం?' అని ఎవరూ అడగటంలేదు.

ఇంతలో బన్సు రావటం గమనించిన జనం గబగబా అటు పరుగెత్తారు.

నా అడుగులు ముందుకు పడలేదు.

పాపం ఆ వృద్ధుడు దెబ్బ తగిలి సొమ్మసిల్లిపోయినట్టు పడుకుండిపోయాడు.

దగ్గరగా వెళ్లి కూర్చుని చేతి రుమాలు అతని గాయానికి అదిమిపెట్టాను.

మెల్లగా కళ్లు తెరిచా డతను.

"ఛీ! ఛీ! ఏం మనుషులు! మానవత్వం లేని మనుషులు!" - కోపంగా ఏదో అనబోతున్న నన్ను "వద్దమ్మా! పాప మాళ్ల బట్టలన్నీ ఖరాబైతయని కోపగించుకున్నాడు కాని అళ్ల తప్పేముంది, తల్లీ!" అంటూ వారించాడు.

ఆ క్షణం నా కతను ఓ బిచ్చగాడిలా గాక, గొప్ప యోగిలా కనిపించాడు.

"ఎందుకు తాతా, నీ కీ తుడవటాలూ, గొడవా అంతా! ఊరికే అడిగినా నాలుగు పైసలు దొరుకుతాయి కదా!" అన్నా నతన్ని జాలిగా చూస్తూ.

"పుకట్ల పైసలు తీసుకుని కూర్చోనీకి పాణ మొప్పక ఇట్ల చేస్తున్న తల్లీ! ఏడైనా పనడిగితే గింత మునలోనివి ను వ్వేం చేస్త వంటన్నరు."

నాలుగు డబ్బుల కోసం కాళ్లు చేతులు విరుచుకుని సోమరిగానే అడుక్కున్న వాళ్ల గురించి విన్నాం కానీ, ఇతను ...

"నీ కెవరూ లేరా తాతా!" అసందర్భమైనా అసంకల్పితంగా అడిగాను.

"ఉన్నరు, తల్లీ! కొడుకులు, కోడండ్లు, మనుమలు - అంతా ఉన్నరు. నేనే అళ్లకా డుండలేక ..." గొంతు బొంగురుపోతుండగా తలొంచుకుని అన్నాడు.

అనవసరంగా అతని గతం అడిగి అతన్ని బాధపెట్టా ననిపించింది.

ఆ సంఘటన ఆ రోజంతా నా మనసును కలచివేస్తూనే ఉంది.

ఆ మర్నాటి నుంచి అత నక్కడ కనపడలేదు. యథాప్రకారం చెత్త చెదారంతో నిండిన ఆ స్టాప్‌కొచ్చినప్పుడల్లా నా కతనే గుర్తుకొస్తున్నాడు.

★

సప్తపది

కమ్మవారు మీ స్థోమతు, అభిరుచికి తగు దేశ విదేశీ వివాహ సంబంధములకు మరియు పునర్వివాహమునకు సంప్రదించవలెను **Also for family Counselling. Consult on prior appointment.**

"SAPTHAPADI"
5-36 Besides Busdepot, Dilshuknagar, Hyderabad - 500 036
Phone : 876 990